క్లుప్తంగా

నేటి నుండి వేంకటేశ్వరస్వామి ఆలయ రజతోత్సవ వేడుకలు


ఆలయంలో కొలువైన వేంకటేశ్వర స్వామి

డోన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ రజతోత్సవ వేడుకలను శనివారం నుంచి వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు మూడు రోజులపాటు జరిగే ఉత్సవాల సందర్భంగా భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ధర్మకర్తలు పాతాళం సుబ్బారావు, రజనీకుమారి తెలిపారు. మొదటి రోజు ఆలయంతో పాటు ప్రధాన వీధుల్లో సత్సంగమం, దివ్య ప్రబంధ పారాయణం కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌శర్మ, రాముశర్మ ఆధ్వర్యంలో జరిగే రజతోత్సవ వేడుకల్లో భక్తులు పాల్గొని స్వామివారి ఆశిస్సులు పొందాలని వారు కోరారు.

గాలికుంటు టీకాలను సద్వినియోగం చేసుకోండి


దూడకు టీకా వేస్తున్న పశువైద్యాధికారిణి భారతీ దేవి

అవుకు: పశువులకు గాలికుంటు టీకాలు వేస్తున్నామని, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని అవుకు పశు వైద్యాధికారిణి భారతీదేవి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రం అవుకులో గాలికుంటు వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆమె పాకల వద్దకు సిబ్బందితో వెళ్లి పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా గాలికుంటు వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన చర్యలపై పాడిరైతులకు అవగాహన కల్పించారు. వ్యాధి లక్షణాలు వివరించిన ఆమె అశ్రద్ధ వహిస్తే పశువులు చనిపోయే ప్రమాదం ఉందన్నారు. ముందస్తుగానే గాలికుంటు టీకాలను వేయించాలని పాడిరైతులకు సూచించారు. కార్యక్రమంలో ఎల్ఎస్ఏ రాజేష్, సిబ్బంది హుస్సేన్, రవి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్యాపిలి: మండల పరిధిలోని జలదుర్గం, హుసేనాపురం, పీఆర్ పల్లి, నల్లమేకలపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని జలదుర్గం ఏఈ నాగేశ్వరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జలదుర్గం, నల్లమేకలపల్లి సబ్ స్టేషన్‌లలో చేపడుతున్న మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్

ప్యాపిలి: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు ఈ నెల 13 న జరుగనున్నందున ఎంపీటీసీ సభ్యులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీటీసీలకు ఎమ్మెల్సీ ఎన్నికలపై ఎంపీడీఓ అవగాహన కల్పించారు. ఎంపీటీసీలు డోన్‌లోని ఆర్డీఓ కార్యాలయంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, అవసరమైన ధురవపత్రాన్ని తీసుకెళ్లాలని చెప్పారు. నిరక్షరాస్యులైన ఎంపీటీసీలకు సహాయకుడిని ఏర్పాటు చేయబడుతుందన్నారు. బ్యాలెట్ పేపర్‌లో తాము ఎన్నుకోబోయే అభ్యర్థి పేరు ఎదురుగా ప్రాధాన్యత సంఖ్యను సక్రమంగా వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ బాలకృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

బేతంచెర్ల: మండల పరిధిలోని బుగ్గానిపల్లెకు గ్రామానికి చెందిన కొమ్ము తిరుమలేష్, గుమ్మ సుబ్బారాయుడు శుక్రవారం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. సిమెంట్‌నగర్ గ్రామంలో జరిగిన వివాహానికి వెళ్లి తిరిగివస్తుండగా బుగ్గానిపల్లె తండా సమీపాన శివాలయం బైక్ అదుపుతప్పి బోల్తాపడడంతో కొమ్ము తిరుమ లేష్‌కు తీవ్రగాయాలవ్వగా గుమ్మ సుబ్బరా యుడుకు స్వల్పంగా గాయపడ్డాడు. వీరిని చికిత్స నిమిత్తం శేషారెడ్డి సీహెచ్‌సీకి తరలించారు.

అలరించిన నృత్యప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణమాఢవీధిలో కడపకు చెందిన సాయి నటరాజ డాన్స్ అకాడమీ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. మూషికవాహన, నర్తన గణపతిం, లింగాష్టకం, బో..శంభో, ఓంకారం, ఓం నమఃశివాయ తదితర గీతాలకు అలివేలుమంగ, సుజిత, శిరీష, చిన్న, అరవింద్ తేజ తదితరులు నృత్య ప్రదర్శన చేశారు. రెండవ కార్యక్రమంలో భాగంగా మైదుకూరుకు చెందిన వై.నాగరాజు, బృందం హరికథ కార్యక్రమాన్ని నిర్వహించారు.

భవిత...‘ప్రత్యేక’ భరోసా!

- ప్రత్యేక అవసరాల పిల్లలను తీర్చిదిద్దుతున్న భవిత కేంద్రాలు
- ఫిజియోథెరపీ.. ఉచితంగా పరికరాల పంపిణీ
- చెవిటి, మూగ విద్యార్థులకు స్పీచ్‌థెరపీ, లిప్‌రీడింగ్ బోధన


బనగానపల్లె భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఐఈఆర్టీ (ఫైల్)

బనగానపల్లె: భవిత కేంద్రాలు ప్రత్యేక అవసరాల చిన్నారులకు భరోసా కల్పిస్తున్నాయి. మానసిక, శారీరక వైకల్యం, బహులనాడి వ్యవస్థ బలహీనత, మానసకి రుగ్మత, మరుగుజ్జు తదితర లోపాల దివ్యాంగ చిన్నారులకు భవిత కేంద్రాలు భవిష్యత్తును ఇస్తున్నాయి. ప్రతి మండలంలో నెలకొల్పిన ఈ కేంద్రాల్లో ఉద్యోగులు ప్రత్యేక అవసరాల పిల్లలకు వినూత్నంగా సేవలందిస్తూ సాధారణ పిల్లల మాదిరిగా తీర్చిదిద్దుతున్నారు. సాధారణ పిల్లలతో కలిసి సాగేలా విద్య బోధిస్తున్నారు. భవిత కేంద్రాల్లోనే కాకా ఇంటి వద్దనే చేసుకోవడానికి వీలుకలిగే స్థాయిలో ఫీజియో థెరపీ అందిస్తున్నారు. ఒక్కో మండలంలో నిర్ణయించిన తేదీల ప్రకారం ఫిజియోథెరపీ క్యాంపులు నిర్వహిస్తున్నారు. భవిత కేంద్రాలకు రాలేని చిన్నారులకు ప్రతి శనివారం ఇంటి వద్దనే విద్య అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వారికి అర్థమయ్యే రీతిలో ప్రత్యేక పద్ధతుల్లో పాఠాలు బోధిస్తున్నారు. ఈ కోవలో 21 రకాలు ఉన్నట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. అంధత్వం, దృష్టిలోపం, వినికిడిలోపం, ఉచ్ఛారణ దోషాలతో పలకడం, శారీరకవైకల్యం, మానసిక వైకల్యం, పక్షవాతం, బహులవైకల్యం, కుష్టివ్యాధి నయగ్రస్తులు, మరుగుజ్జు, దీర్ఘకాలిక నరాల సమస్య, బహులనాడి వ్యవస్థలో బలహీనత, మానసకి రుగ్మత తదితర సమస్యలు ఉన్న ప్రత్యేక అవసరాల చిన్నారులకు ప్రత్యేక శిక్షణతో తీర్చిదిద్దుతున్నాయి భవిత కేంద్రాలు.

మండలాల వారీగా ప్రత్యేక అవసరాల విద్యార్థులు

మండలం	విద్యార్థులు
బనగానపల్లె	196
కోవెలకుంట్ల	111
అవుకు	128
కొలిమిగుండ్ల	187
సంజామల	99


విద్యార్థికి ఫిజియోథెరపీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

భవిత కేంద్రాల్లో అందుతున్న సేవలు

మానసిక దివ్యాంగులకు రూ.14వేల విలువైన ఎమ్మార్ కిట్స్‌ను ఉచితంగా అందజేస్తారు. మధ్యాహ్న భోజనంతో పాటు బస్సు పాసులను ఇస్తారు. వేలు విలువ చేయు హియరింగ్ మిషన్లు, మూడు చక్రాల కుర్చీలు తదితర వాటిని అందజేస్తారు. అత్యంత తీవ్రమైన మానసిక వైకల్యం కలిగిన వారికి దినసరి కార్యక్రమాలు ఎలా చేసుకోవాలో కృత్యాల ద్వారా ప్రత్యేక ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తారు. విద్యార్థులతో ఆ పనులు చేయిస్తూ క్రమంగా అలవాటు చేస్తారు. మానసిక దివ్యాంగులకు దృశ్యరూపక వస్తువుల ద్వారా సులుభ పద్ధతిలో అర్థమయ్యేలా పాఠాలు బోధిస్తున్నారు. చెవిటి, మూగ విద్యార్థులకు స్పీచ్ థెరపీలో ఫ్లాస్‌కార్డు, లిప్‌రీడింగ్, టచ్ ద్వారా అక్షరాలు నేర్పిస్తున్నారు. వైకల్య శాతం తగ్గి వారు ఇతరులపై ఆధారపడకుండా సొంతంగా పనులు చేసుకునేలా తర్ఫీదు ఇస్తున్నారు.

ప్రతి మండలంలో భవిత కేంద్రం

నియోజకవర్గంలోని బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల కోవెలకుంట్ల మండల కేంద్రాల్లో భవిత కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 721 మంది ప్రత్యేక అవసరాల విద్యార్థులు ఉండగా భవిత కేంద్రాల్లో వంద మంది ఉన్నారు. మిగిలిన విద్యార్థుల్లో కొందరు ఇళ్లవద్దనే ఐఈఆర్టీల ద్వారా విద్యాబోధన పొందుతుండగా మరికొందరు ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్నారు. ఈ కేంద్రాలకు వారానికోసారి ఫిజియోథెరపీ ట్రైనర్ వచ్చి వ్యాయాయం చేయిస్తారు. దీంతోపాటు ఇంట్లో వ్యాయాయం ఎలా చేయించాలో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. ప్రతి శనివారం నడువలేని పిల్లల ఇళ్ల వద్దకు వెళ్లి తల్లిదండ్రులకు పిల్లల పట్ల తీసుకోవాల్సిన అంశాలను తెలియజేస్తారు.

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ



భవిత కేంద్రానికి వస్తున్న ప్రత్యేక అవసరాల చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ తీసుంకుంటున్నాం. పిల్లల మనోభావాలను అనుసరించి వారికి పాఠాలు చెబుతున్నాం. వారికి అనుగుణంగా వ్యవహరిస్తూ మనోధైర్యాన్ని నింపేలా కృషి చేస్తున్నాం. అత్యవసరమైన దినసరి చర్యలు స్వయంగా చేసుకునేలా శిక్షణ ఇస్తున్నాం. చిన్నారులకు అలవాటుగా మారేందుకు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

– ఎస్ శ్రీనివాసులు, ఐఈఆర్టీ, బనగానపల్లె

భవిత కేంద్రాలు ఎంతో ఉపయోగం



ప్రత్యేక అవసరాల విద్యార్థులకు భవిత కేంద్రాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. మా కుమారుడు మహమ్మద్ హరిష్ నడువలేని స్థితిలో ఉండేవాడు. భవిత కేంద్రాల ఉపాధ్యాయుల సూచనల మేరకు ఫిజియోథెరపీ చేయించాను. ప్రస్తుతం నడువగలుగుతున్నాడు. చాలా సంతోషంగా ఉంది. మా బాబు మామూలు స్థితికి వస్తాడనే నమ్మకం కలిగింది.

– మహమ్మద్‌రఫీ, విద్యార్థి తండ్రి, కోవెలకుంట్ల,

పిల్లలకు వసతులు కల్పిస్తున్నాం



దివ్యాంగులకు భవిత కేంద్రాల్లో వసతులన్ని సక్రమంగా అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. తల్లిదండ్రులు పిల్లలను భవిత కేంద్రాలకు తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాం. పిల్లలకు ప్రభుత్వపరంగా అందిస్తున్న ఉచిత పథకాలను గుర్తించి తల్లిదండ్రులకు వివరిస్తున్నాం. చిన్నారు భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు తమవంతు కృషి చేస్తున్నాం.

– స్వరూప, ఎంఈఓ, బనగానపల్లె మండలం

రోడ్డు నిబంధనలు పాటించండి

బేతంచెర్ల: ప్రతిఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని సీఐ ప్రియతం రెడ్డి సూచించారు. మద్యం మత్తులో వాహనాలను నడిపి విలువైన మీ ప్రాణాలు పోగొట్టుకోవద్దన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ మాట్లాడారు. 2020 నుంచి 2023 వరకు మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 47 మంది చనిపోయారని, ఇందులో 32 మంది గాయాల పాలయ్యారన్నారు. రెండేళ్లుగా డోన్ రహదారుల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. ప్రమాదాలు జరిగే స్థలాల వద్ద బారి కేడ్లను ఏర్పాటు చేశామని, అయితే వాహనచోదకులు సైతం నిబంధనలు పాటించాలని సూచించారు. మండలంలో ఆరు నెలల్లో 170 డ్రంకన్ డ్రైవ్ కేసులు, ఓపెన్ డ్రంకన్ కేసులు 220 నమోదు చేశామన్నారు. వాహనచోదకులు మీ కుటుంబ సభ్యులను గుర్తు చేసుకుని ముందుకు సాగాలని, నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నిర్మూలనకు సహకరించాలని సూచించారు.

రేపు శేగు రమణయ్య విగ్రహ ఏర్పాటు

డోన్ టౌన్: మండల పరిధిలోని శ్రీకాశిరెడ్డి నాయన వృద్ధాశ్రమ వ్యవస్థాపకుడు, శ్రీశైల దేవస్థానం మాజీ చైర్మన్ దివంగత శేగు వెంకటరయణయ్య విగ్రహాన్ని ఈనెల 12వ తేదీన ఏర్పాటు చేస్తున్నట్లు ఆశ్రమ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆశ్రమ నిర్మాణం, సమాజ సేవకు శేగు రమణయ్య చేసిన కృషికి గుర్తుగా కుటుంబ సభ్యుల సహకారంతో ఓబులాపురం మిట్ట వద్ద ఉన్న శ్రీకాశిరెడ్డి నాయన ఆశ్రమం ఆవరణలో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

బేతంచెర్ల: పట్టణంలోని దుర్గాపేట కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి తెలిపారు. కాలనీకి సరఫరా అయ్యే బోరు బావిలో భూగర్భజలాలు తగ్గిపోవడంతో తాగునీటి సమస్య తలెత్తింది. కాలనీ వాసులకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టారు. అయ్యల చెర్వులోని మడులలో ఉన్న బోరుకు అదనపు మోనోబ్లాక్ మోటార్ ఏర్పాటు చేసి దుర్గాపేట తాగునీటి సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్ తెలిపారు.

రవీంద్రారెడ్డిని మంచి మెజార్టీతో గెలిపించండి


ఓటు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: వైఎస్సార్‌సీపీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి ఓటు వేసి మంచి మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పిలుపునిచ్చారు. 13వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో శుక్రవారం ఎమ్మెల్యే స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో ప్రచారం చేశారు. అసోసియేషన్ నాయకులు, న్యాయవాదులు, ఉద్యోగులను కలిసి రవీంద్రారెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది అబ్దుల్‌ఖైర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్నాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకటేశం, న్యాయవాదులు వెంకటేశ్వరరెడ్డి, ఆజాంహుస్సేన్, ఇర్ఫాన్ అబ్బాస్ హుస్సేన్, రఘురామిరెడ్డి, విక్రమ్, అల్లావుద్దీన్, ముజాహీద్, మహబూబ్‌బాషా, షాషావలి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ప్రచారం....

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని కోరుతూ ఎమ్మెల్యే కాటసాని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ప్రచారం చేశారు. పట్టభద్రులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటును వెన్నపూసకు వేసి, వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కాటసాని కోరారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు గుండం నాగేశ్వరరెడ్డి, ఉమ్మడి జిల్లాల ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పోచా శీలారెడ్డి, ప్రచార కార్యదర్శి సిద్దం రెడ్డి రామ్మోహన్‌రెడ్డి, నాయకులు శంకర్‌రెడ్డి, శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మధుసూదన్‌ను బాధ్యతగా గెలిపించాలి

బనగానపల్లె: స్థానిక సంస్థల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ మధుసూదన్‌ను బాధ్యతగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక స్వగృహంలో శుక్రవారం ఎమ్మెల్యే కాటసాని జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారికి ఓటుహక్కు వినియోగంపై ఎమ్మెల్యే అవగాహన కల్పించారు. అనంతరం కాటసాని మాట్లాడుతూ కేటాయించిన కేంద్రాల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు ఈ నెల 13న ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. మన నియోజకవర్గం నుంచి మంచి మెజార్టీతో గెలిపించి సీఎం వైఎస్ జగన్‌కు కానుకగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గుండంనాగేశ్వరరెడ్డి, ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, ఎంపీపీ మానసవీణ, జెడ్పీటీసీ సభ్యురాలు సుబ్బలచ్చమ్మ, ఉపాధ్యక్షురాలు ముబీనా షమీమ్, ఎం లక్ష్మీదేవి, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా న్యాయవాదులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని

గ్రామాల అభివృద్ధికి చర్యలు

బేతంచెర్ల: గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, ప్రాధాన్యత మేరకు మౌలిక వసతులు కల్పిస్తున్నామని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని అంబాపురం గ్రామం నుంచి శైవ పుణ్యక్షేత్రమైన ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయం వరకు గ్రావెల్ రోడ్డు ఏర్పాటుకు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో రూ.40 లక్షలు మంజూరైన విషయం తెలిసిందే. ఈ మేరకు జరుగుతున్న పనులను శుక్రవారం ఎంపీపీ పరిశీలించారు. పనుల పురోగతిపై గ్రామస్తులు, రైతులతో చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, జయరామిరెడ్డి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి

విస్తరణ అధికారిని మార్చొద్దు

కొలిమిగుండ్ల: మండలంలోని తిమ్మనాయినపేట రైతు భరోసా కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి నవీన్‌తేజను మార్పు చేయొద్దని ఆ గ్రామస్తులు కోరారు. ఈ మేరకు శుక్రవారం గ్రామస్తుల సంతకాలు సేకరించి సుబ్బయ్య, బాసు, హుసేన్‌బాషా తదితరులు ఎంపీడీఓ సుబ్బరాజుకు వినతి పత్రం అందజేశారు. వ్యవసాయాధికారి పవన్‌కుమార్ రైతు భరోసా కేంద్రంతో పాటు విస్తరణ అధికారిని లేకుండా చేయాలని ప్రయత్నం చేస్తున్నారని వారు ఎంపీడీఓ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎంపీడీఓ సచివాలయ పరిధిలోని అధికారులను మార్పు చేయాలంటే తప్పక తమ అనుమతితోనే జరగాల్సి ఉంటుందని, అధైర్యపడొద్దని సూచించారు. ఆర్బీకేతో పాటు సంబంధిత అధికారిని ఎక్కడికి మార్పు చేసే అవకాశం లేదని హామీ ఇచ్చారు.

నేటి నుంచి మద్యం దుకాణాల బంద్

డోన్ టౌన్/బేతంచెర్ల: ఎమ్మెల్సీ ఎన్నికలు ఈ నెల 13న జరుగనున్న నేపథ్యంలో శనివారం సాయంత్రం 4 గంటల నుంచి మద్యం దుకాణాలు బంద్ చేస్తున్నట్లు జిల్లా మద్య నిషేధ, అబ్కారీ శాఖ అధికారి రవి కుమార్‌రెడ్డి తెలిపారు. దుకాణాలను సోమవారం సాయంత్రం 4 గంటల వరకు మూసి వేయాలని ఆదేశించారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి

బనగానపల్లెరూరల్: భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వాడాలని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రధాన సీనియర్ శాస్త్రవేత్త ధనలక్ష్మీ రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని యాగంటి పల్లె గ్రామ సమీపంలో ఉన్న కేవీకేలో నేషనల్ ఫర్టిలైజర్ లిమిటెడ్, కేవీకే సంయుక్త ఆధ్వర్యంలో భూసార పరీక్ష ఆధారిత ఎరువుల యాజమాన్యంపై బనగానపల్లె, నందికొట్కూరు మండలాల రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ధనలక్ష్మీ మాట్లాడుతూ మూడేళ్లకోసారి భూసార పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. కేవీకే మృతిక విభాగ శాస్త్రవేత్త రమణయ్య మాట్లాడుతూ ప్రస్తుతం నేలలు సేంద్రియ కర్బన శాతం 0.5శాతం కంటే తక్కువగా ఉందని, నిస్సారం గా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ భూములను పూర్వస్థితికి తీసుకురావాలంటే తప్పకుండా భూసార పరీక్షల ఆధారిత ఎరువులు వాడాల్సి ఉంటుందని సూచించారు నేషనల్ ఫర్టిలైజర్ లిమిటెడ్ ఏరియా మేనేజర్ వంశీకృష్ణ సంస్థ ఉద్దేశం, ఎరువులు సరఫరా పద్ధతులు, రైతులకు అందిస్తున్న సేవాలను వివరించారు. అదేవిధంగా కేవీకే శాస్త్రవేత్తలు బాలరాజు, కృష్ణమూర్తి, ఆదినారాయణ, రవిగౌడ్, మార్కెటింగ్ ఆఫీసర్ వేణుకుమార్ భూసార పరీక్షల అవశ్యకతను వివరించారు.



మాట్లాడుతున్న కేవీకే ప్రధాన శాస్త్రవేత్త ధనలక్ష్మీ

సావిత్రిబాయిపూలే సేవలు చిరస్మరణీయం

కోవెలకుంట్ల: సమాజానికి సావిత్రిబాయి పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సావిత్రిబాయి పూలే 127వ వర్ధంతిని నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈఓ తిమ్మారెడ్డి మాట్లాడుతూ సావిత్రిబాయిపూలే భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా జాతిని ఉద్ధరించడానికి ఎంతగానో పాటుపడ్డారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుగుణ, నీరజ, జ్యోతి, జహీరాబీ, వరలక్ష్మి, నాగేశుడు, ప్రసాదు, ఉసేనయ్య, వెంకటేశ్వర్లు, శివశంకర్, శివప్రసాద్, మల్లికార్జున ప్రసాద్ పాల్గొన్నారు.

అధికారికంగా నిర్వహించాలి

డోన్ టౌన్: సమాజంలోని బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన పూలే దంపతుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఏఈ నాగరాజు కోరారు. సావిత్రిబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక ముక్తేశ్వర ఆలయంలో బీసీ సంఘం నాయకులు ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఆర్గనైజింగ్ అధ్యక్షుడు మల్లికార్జునస్వామి, నాయకురాలు సరస్వతిదేవి తదితరులు పాల్గొన్నారు.


సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ సక్రమంగా చేపట్టాలి

బనగానపల్లెరూరల్: ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో చేపట్టాలని ఎంపీడీఓ శివరామయ్య సూచించారు. శుక్రవారం స్థానిక పాదుపు భవనంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవానికి సంబంధించి టంగుటూరు, పలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ శివశంకరుడు, డాక్టర్ శ్రీలక్ష్మీ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం జరిగింది. ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో ఉన్న 1 నుంచి 9 సంవత్సరాల పిల్లలందరికి తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్లు ఎస్ వెంకటేశ్వర్లు, విజయ కుమార్, ఎంఈఓ స్వరూప, సూపర్‌వైజర్లు సాలమ్మ పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 14వ తేదీ న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని డాక్టర్లు విద్యాసాగర్, అశోక్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం రేవనూరు, మాయలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ఏఎన్ఎంలు, ఆశావర్కర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, ఎంఈఓ తిమ్మారెడ్డి, ఈఓఆర్‌డీ రాధిక పాల్గొన్నారు.


మాత్రలు అందజేస్తున్న ఎంపీడీఓ శివరామయ్య

కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలల హెచ్ఎంలకు ఎంపీడీఓ సుబ్బరాజు, ఎంఈఓ జిలానీ బాషాతో కలిసి కొలిమిగుండ్ల, పేరుసోముల పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు రాజ్‌కుమార్, వినయ్ ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. 14న 1–19 ఏళ్లలోపు పిల్లలకు తప్పక మాత్రలు పంపిణీ చేయాలని మెడికల్ ఆఫీసర్ రాజ్‌కుమార్ సూచించారు.

అవుకు: పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతిఒక్కరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసేలా శ్రద్ధ వహించాలని ఆరోగ్య, విద్యా శాఖ సిబ్బందికి ఎంపీడీఓ అజాంఖాన్ సూచించారు. ఈ నెల14న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఎంపీడీఓ అజాంఖాన్, ఎంఈఓ శ్రీధర్‌రావు, ఉప్పలపాడు పీహెచ్‌సీ డాక్టర్లు వినోద్ కుమార్, యమున ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల హెచ్ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 1 నుంచి 19 సంవత్సరాల పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయాలని వారు సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగసుంకమ్మ, ఆకుమళ్ల ఎంపీహెచ్ఈఓ బలరామిరెడ్డి, సూపర్‌వైజర్లు వేణుగోపాలరాజు, దానమ్మ, హెచ్ఎంలు సుబ్రహ్మణ్యం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆయా పాఠశాలల హెచ్ఎంలకు ఆల్బెండోజల్ మాత్రలను ఎంపీడీఓ వెంగన్న, ఎంఈఓ సోమశేఖర్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. 14వ తేదీన తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మందులు విద్యార్థులకు అంజేయాలని వారు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి, ఎంపీ హెచ్ఓ అబ్దుల్ గఫార్, సూపర్ వైజర్ మల్లేశ్వరీ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నుస్రత్ ఉ జొహరా

ప్యాపిలి: నులిపురుగుల నివారణ చర్యల్లో భాగంగా 19 సంవత్సరాల లోపు చిన్న పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు సక్రమంగా పంపిణీ చేయాలని ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, ఎంఈఓ శ్రీనివాసులు, వైద్యాధికారిణి నుస్రత్ ఉ జొహరా సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం డీవార్మింగ్ డేపై వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 14 న తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేయాలన్నారు. ఏడాదిలోపు పిల్లలకు సగం మాత్రను పొడి చేసి నీటిలో కలిపి తాపాలన్నారు. 1–19 సంవత్సరాల పిల్లలకు ఒక మాత్ర చొప్పున వేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ బాలకృష్ణుడు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ విజయకుమారి పాల్గొన్నారు.

డోన్ రూరల్: ఆల్బెండజోల్ మాత్రలు 1 నుంచి 19 ఏళ్ల చిన్నారులకు వేయాలని ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ ప్రభాకర్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. చిన్నారులందరికీ మాత్రలు తప్పనిసరిగా వేయాలని ఈ సందర్భంగా వారు సూచించారు.